# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2024** **సమయం : 8.30 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత పెరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**
3. **ఈరోజు నుంచి ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు ప్రారంభమవుతాయి.**
4. **తెలంగాణ మంత్రివర్గం ఈ రోజు సాయంత్రం సమావేశమవుతుంది.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.**

==========================

యోగా మన కోసం –సమాజం కోసం "యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ " అనే ఇతి వృత్తంతో 10 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుగుతోంది. 2014 సెప్టెంబర్ 7వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... భారతీయ ప్రాచీనమైన, అమూల్యమైన విశిష్టమైన యోగా ప్రక్రియ గురించి తెలియచేశారు. యోగా ప్రక్రియ అంతర్జాతీయ స్థాయిలో జరిగేలా తోడ్పాటు అందించాలని ప్రధానమంత్రి ఆ సమావేశంలో చేసిన ప్రతిపాదన ఫలితంగానే జూన్ 21వ తేదీని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడం విశేషం.కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ పిలుపు మేరకు యోగా దినోత్సవాన్ని ఈరోజు దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు.కాగా అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్బంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారం చేస్తుంది.

------------------------

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను అభ్యసిస్తున్నారని తెలిపారు. మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందని తెలుపుతూ...

..వాయిస్... 40 సెకన్లు

మరోవైపు దేశ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని లోడి గార్డెన్స్‌లో కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి అశ్వీనివైష్ణవ్ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్ పాల్గొన్నారు. తెలంగాణాలోని సికింద్రాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ రోజు ఉదయం 9 గంటల 46 నిమిషాలకు ప్రారంభం కానున్నాయి. తొలుత ప్రొటెం స్పీకర్ నియామకంపై శాసనసభ కార్యదర్శి ప్రకటన చేస్తారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి రిజిస్టర్లలో సంతకాలు చేస్తారు. ప్రొటెం శాసనసభాపతి గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తర్వాత ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆంగ్ల అక్షరాల వరుసక్రమంలో సభ్యుల ప్రమాణం ఉంటుందని శాసనసభ వ్యవహాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతరం శాసనసభ సభాపతి ఎన్నికల ప్రక్రియను ప్రకటిస్తారు. ఈ సమావేశాలకు సందర్శకుల పాస్లను రద్దు చేసినట్లు. స్థలా భావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. కాగా ప్రొటెం శాసనసభాపతిగా గోరంట్ల బుచ్చయ్య చౌదరిని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నిన్న సాయంత్రం రాజ్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు.

---------------------------

తెలంగాణ మంత్రివర్గం ఈ రోజు సమావేశం కానుంది. ఈ రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో రైతు రుణమాఫీ అమలుకు సంబంధించిన విధి విధానాలు, సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు, పంటల బీమా, శాసనసభ సమావేశాలు, బడ్జెట్ పై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిన్న ఆయన విజయవాడ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించి, ప్రయాణికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు నాణ్యమైన రవాణా సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉచిత ప్రయాణం అమలుపై కమిటీ వేస్తామన్నారు. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించి ఉచిత ప్రయాణంపై అధ్యయనం చేస్తామని చెప్పారు. బస్ స్టేషన్లలో భోజన సదుపాయాలు, మరుగుదొడ్లు మెరుగ్గా ఉండేలా భద్రత, పారిశుద్ధ్య నిర్వహణ చేపడతామని మంత్రి వివరించారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ సంగీత దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఏకంచేసి అనేక మానసిక రుగ్మతలను దూరంచేసే శక్తి సంగీతానికి వుంది. అటువంటి సంగీతానికి మానవాళి జీవితంలో వున్న ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. 120 దేశాలలోని ప్రజలు ఈ సంగీత దినోత్సవంలో పాల్గొంటున్నారు. ఫ్రాన్స్ సాంస్కృతిక శాఖ మంత్రి జాన్ లాంగ్ 1982 జూన్ 21వ తేదీన పారిస్లో మొదటి సంగీత మహోత్సవాన్ని

నిర్వహించారు. అప్పటినుంచి ప్రతి ఏటా జూన్ 21ని ప్రపంచ సంగీత దినోత్సవంగా పాటిస్తున్నారు.కాగా ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ రోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రసారం చేస్తుంది.

---------------------------

పురుషుల టీ–20 క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా బ్రిడ్జ్‌టౌన్ వేదికగా జరిగిన సూపర్–8లో అఫ్ఘానిస్థాన్‌పై భారత జట్టు విజయం సాధించింది. గ్రూప్–1లో భాగంగా నిన్న జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన అఫ్ఘానిస్థాన్ జట్టు 20 ఓవర్లలో 134 పరుగులు చేయడంతో భారత్ 47 పరుగుల తేడాతో అఫ్ఘానిస్తాన్ జట్టు పై విజయం సాధించింది. కాగా భారత జట్టు తర్వాతి సూపర్–8 మ్యాచ్‌ను రేపు బంగ్లాదేశ్ జట్టుతో ఆడనుంది.

---------------------------

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, ఆరోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, జూన్ 27 వరకు హైదరాబాద్‌లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. 1–19 ఏళ్ల వయసు పిల్లలకు తల్లిదండ్రులు తప్పక ఈ మాత్రలు ఇప్పించాలని మంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రులుగా నిన్న పలువురు మంత్రులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా ఏ. సత్య ప్రసాద్, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా కందుల దుర్గేశ్, బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రిగా ఎస్.సవిత, సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రిగా కె శ్రీనివాస్ భాధ్యతలు స్వీకరించారు. అలాగే విజయవాడ గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనరేట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయా శాఖల్లో కీలక అంశాలకు సంబంధించిన దస్త్రాలపై మంత్రులు తొలి సంతకాలు చేశారు.

---------------------------

తెలంగాణలో త్వరలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని రాష్ట్ర వాణిజ్య శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లో గ్రూప్ 2, గ్రూప్ 3 ఖాళీలను భర్తీ చేయాలని చేపట్టిన విద్యార్థుల ధర్నాపై మంత్రి స్పందిస్తూ, త్వరలో గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలను ప్రకటిస్తామన్నారు. ఉద్యోగాల ఖాళీలను గుర్తించి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఉద్యోగాల భర్తీ విషయంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా ఉండేందుకు నిపుణులతో చర్చిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

తెలంగాణలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జూలై 2 నుంచి ప్రత్యేక విరామ

దర్శనాలు అమలు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు తిరిగి రాత్రి 7 నుంచి 7 గంటల 30 నిమిషాల వరకు విరామ దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు 200 రూపాయలు చెల్లించి ప్రత్యేక విరామ దర్శనం చేసుకోవచ్చని వివరించారు. ఆలయ కౌంటర్లు, దేవస్థాన వెబ్‌సైట్‌లో బ్రేక్ దర్శన టికెట్లు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో ఖరీఫ్ సాగు, ఎరువుల నిల్వలు, సరఫరాపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 19 వరకు తెలంగాణలో 17.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయన్నారు. అత్యధికంగా 15.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని వివరించారు.

======================